
సాక్షి ఒడిశా
సోమవారం । 23 । డిసెంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 5,71,998
బంగారం : 1 గ్రాము 650 మిల్లీ గ్రాములు
వెండి : 37 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



వేడుకగా గజపతి ఉత్సవం
గజపతి ఉత్సవం వేడుకగా జరిగింది. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. - 8లో



రైతులను ఆదుకుంటాం
రైతులను ఆదుకుంటామని మంత్రి అన్నారు. పంట నష్టం పరిశీలించారు. - 8లో

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రమాదంలో మృతి చెందిన శత్రుఘ్న

రాయగడ: జిల్లాలోని కాశీపూర్ సమితి టికిరిలో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. మృతుడిని గౌరఖ్‌పూర్ పంచాయతీలోని బయిగన్‌గుడ గ్రామానికి చెందిన శత్రుఘ్న మాఝి(32)గా గుర్తించారు. గాయాలు తగిలిన వారిలో దీనబంధు మాఝి, ఒక లారీ డ్రైవరు ఉన్నారు. శత్రుఘ్న మాఝి అతని స్నేహితుడు దీనబంధుతో కలసి టికిరి వైపు వెళుతుండగా బైకు అదుపు తప్పి అటువైపు నడుచుకుంటూ వెళుతున్న ఒక వ్యక్తిని బలంగా వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైకు నడుపుతున్న శత్రుఘ్న, దీనబంధు కింద పడిపోయారు. తీవ్రగాయాలకు గురైన ముగ్గురిని ఆస్పత్రికి తరలించగా శత్రుఘ్న మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. తీవ్ర గాయాలకు గురైన దీనబంధు, లారీ డ్రైవరు చికిత్స పొందుతున్నారు. పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యం



యువకుని మృతదేహం

రాయగడ: సదరు సమితిలోని తుంభిగుడ సమీపంలో ఉన్న కొందోతుంభిగుడ వద్ద నాగావళి నదిలో గుర్తు తెలియని యువకుని మృతదేహాన్ని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. నదిలో కొట్టుకు వస్తుండగా గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

పాముకాటుతో బాలుడు మృతి



బాలుడి మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఎన్ఏసీ 9వ వార్డులో నివాసం ఉంటున్న విశ్వనాథ్ మహంతి కుమారుడు బిపూన్ మాహంతి(7) ఆదివారం పాముకాటుతోమృతి చెందాడు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులంతా భోజనాలు కానిచ్చి నిద్రకు ఉపక్రమించారు. చలి ఎక్కువగా ఉండడంతో పిల్లాడికి కంబళి కప్పి నిద్రపుచ్చారు. అర్ధరాత్రి పిల్లాడు కేక వేసినప్పుడు లైట్ వేసి చూడగా ఓ నాగుపాము ఆ కంబళి నుంచి బయటకు వెళ్లడం కనిపించింది. వెంటనే బాలుడిని బలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు తెల్లవారుజాము 4 గంటల సమయంలో మృతి చెందాడు. బలిమెల ఐఐసీ ధీరాజ్ పట్నాయిక్ విషయం తెలుసుకుని బలిమెల ఆరోగ్య కేంద్రానికి వెళ్లి కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి



మృతి చెందిన ఆవు

రాయగడ: విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి చెందిన సంఘటన జిల్లాలోని కాశీపూర్ సమితి టికిరి పంచాయతీలోని జమ్ముగుడ గ్రామంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన డొంబురుధర్ సాహుకు చెందిన రెండు ఆవులు పచ్చికను మేసుకుంటూ వెళుతున్న సమయంలో సమీపంలో గల విద్యుత్ స్తంభానికి తాకడంతో షాక్‌కు గురైన ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు డిమాండ్ చేస్తున్నాడు.

భక్తులకు కొత్త సౌకర్యాలు

- శ్రీమందిరంలో వరుస క్రమంలో దర్శన విధానం
- ఈ నెలలో ప్రయోగాత్మక ప్రయత్నం



శ్రీ మందిరం సింహ ద్వారం

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని దర్శనం సులభమవుతోంది. శ్రీ మందిరం ప్రాంగణం నుంచి వరుస క్రమంలో దర్శనం కోసం భక్తులకు అనుమతిస్తారు. ఈ మేరకు ప్రతిపాదనలు ఆమోదితమై ప్రయోగాత్మక కార్యాచరణ చేపట్టనున్నట్లు రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ ఆదివారం తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల చివరి వారంలో వరుస క్రమంలో దర్శన విధానం ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. కొత్త సంవత్సరం జనవరి నెల 1వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో వరుస క్రమ దర్శనం విధానం అమలు చేసేందుకు ఈ ప్రయోగాత్మక ప్రయత్నంగా పేర్కొన్నారు.

రెండు విడతల్లో ప్రయోగం

ఈ నెల 27 లేదా 28వ తేదీ నాటికి కొత్త విధానాల అమలుకు అనుబంధ సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల 30, 31వ తేదీన వరుసగా 2 రోజులు వరుస క్రమ దర్శనం విధానం ప్రయోగాత్మకంగా ప్రారంభిస్తారు. బాగోగులు సమీక్షించిన మేరకు కొత్త సంవత్సరం ఆరంభం నుంచి ఈ విధానం పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు దాదాపు ఏర్పాట్లు పూర్తయినట్లు మంత్రి వివరించారు. ఈ విధానంతో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయో వృద్ధులకు సులభ దర్శన సౌకర్యం వీలవుతుంది.

వరుస విధానం ఇలా..

తొక్కిసలాట లేకుండా రత్న వేదికపై మూల విరాట్లను దర్శించుకునేందుకు వీలుగా వరుస విధానం అమలు చేస్తున్నారు. శ్రీ మందిరం ప్రధాన దేవస్థాన సముదాయం లోనికి సింహ ద్వారం గుండా ప్రవేశం కల్పిస్తారు. 22 మెట్ల ఆవరణ నుంచి గర్భగుడిలోకి ప్రవేశించేందుకు 7 మెట్ల ఆవరణ నుంచి వరుస విధానం ప్రారంభం అవుతుంది. దర్శనం తర్వాత 2 వేర్వేరు ద్వారాల గుండా భక్తులకు వెలుపలకు పంపిస్తారు. ఘంటి ద్వారం, గరుడ ద్వారం గుండా దర్శన అనంతరం భక్తులకు వెలుపలకు అనుమతిస్తారు. ఘంటి ద్వారం గుండా దివ్యాంగులు, మహిళలు, వయో వృద్ధులకు, గరుడ ద్వారం గుండా పురుషుల్ని వెలుపలకు వెళ్లేందుకు అనుమతిస్తారు.

కొత్త దర్శన సౌకర్యం

2025 సంవత్సరం జనవరి నెల 1 నుంచి శ్రీ మందిరంలో బలభద్రుడు, దేవీ సుభద్ర, సుదర్శన సమేత శ్రీ జగన్నాథ స్వామి చతుర్ధా మూర్తుల దర్శనం సులభతరం అవుతుంది. తాత్కాలిక ఏర్పాట్లతో వరుస వ్యవస్థ ఏర్పాటు అవుతుంది. ఉత్సవాదుల్లో అడ్డు తొలగించేందుకు వీలుగా ఈ వ్యవస్థని ఖరారు చేశారు. ఈ విధానంలో 6 వరుసలు ఏర్పాటు చేస్తారు. ర్యాంప్ సౌకర్యం భక్తులకు దర్శనం సులభతరం చేస్తుంది.

వేర్వేరు వరుసల్లో

మొదటి వరుసలో దివ్యాంగులు, రెండో వరుస గుండా పిల్లలతో ఉన్న మహిళలు, మూడో వరుసలో వయో వృద్ధులు, మిగిలిన మూడు వరుసల్లో పురుషులకు దర్శనం కోసం అనుమతిస్తారు. ఈ మూడు వరుసల గుండా అభీష్టం మేరకు మహిళలు వెళ్లేందుకు వెసులుబాటు కల్పిస్తారు.

మాజీ సైనికుల భద్రత

భగవంతుని మహా ప్రసాదాల విక్రయ సముదాయం ఆనంద బజార్ ప్రాంగణంలో నిరంతర భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. 20 మంది విరామ సిబ్బందితో ఈ వ్యవస్థ పని చేస్తుంది. శ్రీ మందిరం ప్రధాన సముదాయం ప్రాంగణంలో అవాంఛనీయ రద్దీ నివారణ వీరి ప్రధాన కార్యాచరణగా మంత్రి పేర్కొన్నారు. ఆలయ నియమ నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేయడంలో వీరు కీలక పాత్ర పోషిస్తారు. అడ్డ దారుల్లో దక్షిణలు వసూలు చేసే విధానం నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని మంత్రి వివరించారు.

ఘనంగా నందో జయంతి



డాక్టర్ శరత్ కుమార్ మహంతిని సన్మానిస్తున్న దృశ్యం



డాక్టర్ గంగాధర్ నందోకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న అతిథులు



ప్రసంగిస్తున్న డాక్టర్ సురేష్ దాస్



జి.వెంకటరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

జయపురం: ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఎనలేని కృషి చేసిన సాహితీ వేత్త, రచయిత, సమాజ సేవి స్వర్గీయ డాక్టర్ గంగాధర నందో చిరస్మరణీయులని ప్రముఖ సాహితీ వేత్త జయపురం సాహితీ పరిషత్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ దాస్ అన్నారు. స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన నందో జయంతి కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. నందో స్మృతి కమిటీ, జయపురం సాహిత్య పరిషత్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. తరుణ ప్రజ్ఞా భారతి సంస్థను నెలకొల్పి ప్రతీ ఏడాది మన సంస్కృతులపై, సంప్రదాయాలపైన ప్రజల్లో నందో పోటీలు నిర్వహించారన్నారు. సాహితీ వేత్తగా, సమాజ సేవిగా నందో కొరాపుట్ జిల్లా ప్రజల హృదయాలలో నిలిచి పోయారన్నారు. నందో 36 పుస్తకాలు రచించారని వెల్లడించారు. ముఖ్యఅతిథిగా జగన్నాథ్ రౌత్, ముఖ్యవక్తగా సాహితీ వేత్తలు శ్రీనాథ్ మిశ్ర, హరిహర కరసుధా పట్నాయక్, అనసూయ నందో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహిత్యవేత్త, విక్రమదేవ్ కళాశాల విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ శరత్ కుమార్ మహంతిని డాక్టర్ గంగాధర్ నందో సాహిత్య సమ్మాన్ అవార్డుతో సన్మానించారు. వ్యవసాయ విభాగ విశ్రాంత ఉన్నతాధికారి జి.వెంకటరెడ్డిని పర్యావరణ పరిరక్షణ సమ్మాన్ అవార్డుతో సత్కరించారు. జగదీష్ అధికారి, ప్రదీప్ కుమార్ సాహు, కృష్ణ చంద్ర, గుప్త కైలాశ, డాక్టర్ ప్రదీప్ కుమార్ మిశ్ర, డాక్టర్ మనోరంజన్ ప్రదాన్, సుధాంశు పట్నాయక్, కృష్ణ చంద్ర మహారాణా, రాధా మోహన్ పండా, ప్రదీప్ సామంతరాయ్, జయపురం సాహిత్య పరిషత్ కార్యదర్శి నిరంజన్ పాణిగ్రాహి, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బిజయ్ మహంతి కన్నుమూత



బిజయ్ మహంతి

భువనేశ్వర్: మాజీ శాసన సభ సభ్యుడు బిజయ్ మహంతి (60) మృతి చెందారు. ఆయన భువనేశ్వర్ మధ్య నియోజక వర్గం నుంచి వరుసగా 2 సార్లు రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు. 2 సార్లు బిజూ జనతా దళ్ అభ్యర్థిగా పోటీ చేశారు. వరుసగా 2009, 2014 ఎన్నికల్లో భువనేశ్వర్ సెంట్రల్ నియోజక వర్గం నుంచి బీజేడీ అభ్యర్థిగా శాసన సభకు ఎన్నికయ్యారు. నగరంలో ఆదివారం మధ్యాహ్నం ఒక అతిథి గృహంలో ఉండగా బిజయ్ మహంతి ఉన్నట్టుండి అపస్మారకంలోకి జారుకున్నారు. హుటాహుటిన స్థానిక క్యాపిటల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. తోటి ఎమ్మెల్యే మృతి చెందడంతో బీజేడీ శిబిరంలో విషాద ఛాయలు అలముకున్నాయి. రాష్ట్ర గవర్నరు రఘుబర దాస్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ మాజీ ఎమ్మెల్యే మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

అలరించిన స్వరగానామృత లహరి



ప్రారంభ కార్యక్రమంలో చైతన్య మెలోడీస్ సభ్యులు



పాటలు పాడుతున్న కళాకారులు

పర్లాకిమిడి: స్థానిక జంగం వీధి వద్ద సింహాద్రి అప్పన్న ఫంక్షన్ హాలులో చైతన్య మెలోడీస్ ఆధ్వర్యంలో స్వరగానామృతలహరి అధ్యక్షులు ఇసై వెంకట్రావు ఆధ్వర్యంలో వీనులవిందుగా జరిగినది. పాతపట్నానికి చెందిన పారశెల్లి రామరాజు మాస్టారు స్వరగానా మృత లహరి కార్యక్రమాన్ని ప్రారంభించగా.. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పాతపట్నం ప్రాంతాల నుంచి విచ్చేసిన 40 మందికిపైగా గాయనీగాయకులు తెలుగు, హిందీ పాటలు పాడారు. ఔత్సాహిక గాయనీ గాయకులను ప్రోత్సాహించేందుకు చైతన్య మెలోడీస్ ఏర్పాటు చేసుకున్నామని కార్యదర్శి టి.కిశోర్ తెలిపారు. కార్యక్రమంలో విజేతలకు సాయంత్రం బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమం విజయవంతానికి కె.చిరంజీవులు, వెంకట్, పి.శ్రీనివాస్, శివ కృషిచేశారు.

గణితంపై ఆసక్తి చూపాలి



పర్లాకిమిడి: మ్యాథ్స్‌డేలో ఉపాధ్యాయులు



పర్లాకిమిడి: మాట్లాడుతున్న జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రవికుమార్

పర్లాకిమిడి: గణితంపై భయాన్ని వీడి ఇష్టాన్ని పెంచుకోవాలని వక్తలు అన్నారు. గుసాని బ్లాక్ జాజిపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక అప్‌గ్రేడ్ పాఠశాలలో జాతీయ గణిత విజ్ఞాన దినోత్సవాన్ని జిల్లా ముఖ్యవిద్యాధికారి డాక్టర్ మాయాధర సాహు ఆదేశాలమేరకు జిల్లా సైన్సు కోఆర్డినేటర్ ఎ.రవికుమార్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు సాత్మిక్ పట్నాయక్ ముఖ్యవక్తగా పాల్గొన్నారు. భారతీయ గణిత శాస్త్రజ్ఞులు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామానుజన్ అయ్యంగార్ అగ్రగణ్యులని సాత్మిక్ పట్నాయక్ అన్నారు. మ్యాథ్స్‌డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ముఖ్యఅతిథి ఎ.రవికుమార్ బహుమతి ప్రదానం చేశారు. మోహన్ కుమార్ నాయక్, నర్మదా దెయి స్వాగత ఉపన్యాసం, అతిథి పరిచయం చేశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



వేదికను అలంకరించిన ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి తదితరులు



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న బీజేడీ నేత నిరోభుయ్యాన్

పర్లాకిమిడి: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అన్నారు. జిల్లాలోని గుసాని బ్లాక్ లింగుపురం గ్రామంలోని ఆదర్శ విద్యాలయం ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఉత్సాహంగా జరిగినది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రూపేష్ మాట్లాడుతూ.. ఆదర్శ విద్యాలయం విద్యార్థులు వార్షిక క్రీడల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో గుసాని సమితి అధ్యక్షులు ఎస్.వీర్రాజు, తహసీల్దార్ నారాయణ బెహరా, బీజేడీ నేత నిరో భుయ్యాన్, ఆదర్శ విద్యాలయం సంఘటన్ వైస్ ప్రిన్సిపాల్ డంగు యాదవ్‌రావు, విద్యాలయం నిర్వాహణ అభివృద్ధి కమిటీ సభ్యులు పిత్తబసు, సర్పంచు, సమితి సభ్యులు కిరణ్ పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులను ప్రదానం చేశారు.

ధాన్యం మండీ ప్రారంభం



ధాన్యం మండీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: హడియలో ధాన్యం మండీని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ఆదివారం ప్రారంభించారు. జయపురం రెగ్యులేటింగ్ మార్కెటింగ్ కమిటీ నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లించాలని కోరారు. మండీల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మిల్లర్లు, ప్రభుత్వ సంస్థలు, ప్రొక్యూర్‌మెంట్ ఏజంట్లు రైతుల నుంచి ధాన్యం కొనాలని స్పష్టం చేశారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయకపోతే అకాల వర్షాల కారణంగా ధాన్యం తడచి రైతులకు తీవ్రనష్టం వాటిల్లుతుందని ఎమ్మెల్యే అన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యం అంతా కొనుగోలు చేయకపోతే మరో మార్గం లేక రైతులు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవల్సి వస్తుందని, అందువలన రైతు నష్టపోతాడని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని ధాన్యం కొనాలని బాహిణీపతి విజ్ఞప్తి చేశారు. మిల్లర్లకు, రైతులకు మధ్య సమస్యలు ఏర్పడిన అధికారులు ఉభయ వర్గాలను సమావేశపరచి పరిష్కరించి, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సభ్యుడు తిపతి పట్నాయక్, హడియ సర్పంచ్ సురేష్ బస్తిరియ, సీనియర్ కాంగ్రెస్ నేత భాస్కర పట్నాయక్, జయపురం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బసంత నాయక్, మండీ పరిచాలకులు భక్త చరణ టక్రి, స్వయం సహాక గ్రూప్ గురువారీ హరిజన్, తదితరులు పాల్గొన్నారు.

పాణి పంచాయతీ ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పట్వారి

రాయగడ: జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో కలెక్టర్ ఫరూల్ పట్వారి ఆదివారం నాడు పాణి పంచాయతీ ప్రచార రథాన్ని ప్రారంభించారు. వాటర్ షెడ్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దయానిధి బాగ్, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ సంబంధిత శాఖ అధికారులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పట్వారి మాట్లాడుతూ పాణి పంచాయతీల ద్వారా రైతులు పొందాల్సిన అవసరాలకు సంబంధించి వారిని చైతన్య పరిచేందుకు ఈ రథాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. వారం రోజుల పాటుగా ఈ రథం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తిరిగి ప్రచారాన్ని కొనసాగిస్తుందని అన్నారు.

ప్రెస్ యూనియన్ నూతన కార్యవర్గం



కొత్త కార్యవర్గంలో సభ్యులు

రాయగడ: ప్రెస్ యూనియన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. స్థానిక గాయత్రీనగర్ వద్ద గల సీనియర్ సిటిజన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. యూనియన్ అధ్యక్షులుగా అమూల్య రత్నసాహు, ఉపాధ్యక్షునిగా వెంకటి పాఢి, కార్యదర్శిగా శివాజీ దాస్, సహకార్యదర్శిగా మృత్యుంజయ నంద, కోషాధికారిగా రస్మీ రంజన్ దొరలు నియమితులయ్యారు. యూనియన్ ముఖ్యసలహాదారుడిగా సురేష్ దాస్ వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా యూనియన్ భవిష్యత్ కార్యకలాపాలకు సంబంధించి ఈ సందర్భంగా సమావేశంలో చర్చించారు. రెండేళ్ల పాటుగా కొత్త కార్యవర్గం కొనసాగుతుందని కార్యదర్శి దాస్ తెలిపారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ కార్యాలయం ఎదుట ధర్నా



మల్కన్‌గిరి మెయిన్ రోడ్‌లో రాహుల్ దిష్టిబొమ్మతో ర్యాలీలో బీజేపీ కార్యకర్తలు



స్థానిక కాంగ్రెస్ కార్యాలయం వద్ద రాహుల్ దిష్టిబొమ్మను కాల్చివేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి : మల్కన్‌గిరిలో ఆదివారం సాయంత్రం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఎదుట బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఢిల్లీలో పార్లమెంట్ భవనం వద్ద ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్ ఎంపీ ప్రతాప్ షోడాంగి గాయపడ్డారు. దీనికి నిరసనగా మల్కన్‌గిరిలో బీజేపీ యువ మోర్చ్ నేతాలు బైక్ ర్యాలీ చేసి రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

కళింగాంధ్ర సామాజిక ప్రయాణమే 'నక్షత్ర బాట'

శ్రీకాకుళం కల్చరల్: కళింగాంధ్ర సామాజిక ప్రయాణమే 'నక్షత్రబాట' నవలని ప్రముఖ రచయిత్రి రమాసుందరి అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో సాహితీ స్రవంతి, శ్రీకాకుళ సాహితీ సంయుక్త ఆధ్వర్యంలో అట్టాడ అప్పలనాయుడు రచించిన నక్షత్ర బాట నవల పుస్తకావిష్కరణ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకాకుళం ఉద్యమంలో వీరనారీమణులు సాధించిన విజయాలను నవలలో గొప్పగా రాశారని కొనియాడారు. స్నేహ కళా సమితి అధ్యక్షుడు గంటేడ గౌరినాయుడు మాట్లాడుతూ నక్షత్రబాటను సిక్కోలు ప్రజానీకం మాట్లాడుకునే యాసలో రాయడం అభినందనీయమన్నారు. రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ నవల రాసేందుకు నాలుగేళ్లు పట్టిందన్నారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి అధ్యక్షులు చీకటి దివాకర్, తామాడ అరుణ, పైలా అరుణ, గార రంగనాథం, పిల్లా తిరుపతిరావు, సురంగి మోహనరావు, కేతిరెడ్డి శ్రీనివాసరావు, తెరవే అధ్యక్షుడు యు.నాగేశ్వరరావు, కంచరాన భుజంగరావు, చింతాడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జానపద కళలతో చైతన్యం

పలాస: జాన పద ప్రజాకళలను విప్లవీకరించి అవి తిరిగి ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని ప్రజాకళా మండలి రాష్ట్ర నాయకుడు కొర్రాయి నీలకంఠం చెప్పారు. విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి ఆ విధంగానే తన జముకుల కథతో శ్రీకాకుళం గిరిజనుల పోరాటాన్ని దేశం నలుదిశలా చాటిచెప్పి ప్రజల్లో చైతన్యం తెచ్చారని గుర్తు చేశారు. పలాస మండలం బొడ్డపాడు అమర వీరుల స్మారక మందిరం వద్ద ఆదివారం సుబ్బారావు పాణిగ్రాహి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాకళామండలి కళాకారులు తమ ఆటపాటలతో ప్రేక్షకులను ఉత్తేజ పరిచారు. కార్యక్రమంలో ఎం.ఎస్.ఎస్ జాతీయ అధ్యక్షుడు బైరి నరేష్, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర నాయకురాలు పద్మకుమారి, వివిధ ప్రజా సంఘాల నాయకులు దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచనరావు, జోగి కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దుండగులు!

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలోని కిన్నెర కాంప్లెక్స్ సమీపంలో ఓ వ్యాపారి ఇంట్లో శనివారం రాత్రి ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో వెళ్లి దోపిడీకి యత్నించిన సంగతి తెలిసిందే. ఈ ముగ్గురితో పాటు పాటు వీరికి సహకరించిన నగరానికి చెందిన ఓ షావుకారిని సైతం ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పట్టుబడిన వారిలో ఇద్దరిది తెలంగాణ రాష్ట్రం భద్రాచలం కాగా, ఒకరిది నాగర్‌కర్నూల్‌గా తెలిసింది. ఇందులో ఏ-1 నిందితుడి ఫోన్ కాల్ డేటా ఆధారంగా మిగతా వారిని పట్టుకున్నట్లు సమాచారం. వారం రోజులుగా వ్యాపారి గోవింద్ బ్యాగుతో సొమ్ము తెస్తుండటం, ఇంట్లో వృద్ధురాలైన తల్లి మాత్రమే ఉండటం, ఆమె బంగారు నగలు ధరించి ఉంటుందన్న విషయాన్ని తెలుసుకున్న ఆగంతకులు రెక్కీ వేసినట్లు తెలుస్తోంది.

త్రుటిలో తప్పిన ప్రమాదం

టెక్కలి రూరల్ : బలరాంపురం సమీపంలో ఆదివారం ఓ ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. టెక్కలి నుంచి పాతపట్నం వైపు సుమారు 10 మంది ప్రయాణికులతో వెళ్తున్న టెక్కలి డిపో బస్సు బలరాంపురం సమీపంలో ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో రోడ్డు పక్కగా ఉన్న మట్టిలో కూరుకుపోయింది.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

కాశీబుగ్గ: మందస-సున్నాదేవి రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై ఆదివారం ఉదయం మహిళ మృతదేహం లభ్యమైంది. ఘటనా స్థలంలో లభించిన బస్సు టికెట్ ఆధారంగా మృతురాలిని కాశీబుగ్గ పట్టణానికి చెందిన జాడు వేణమ్మ (55)గా గుర్తించారు. ఈమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



అలరించిన ఒడిస్సీ నృత్యం



అమ్మవారి ఉగ్రరూప నృత్య ప్రదర్శన



ఆదివాసీ వాయిద్య ప్రదర్శనలో కళాకారులు



దేశీ నృత్య ప్రదర్శన

కళలను పరిరక్షించాలి



ఆకట్టుకున్న కళా ప్రదర్శన



సంబల్‌పూరి నృత్య ప్రదర్శన





డొంగిరియా తెగకు చెందిన ఆదివాసీ యువతిని సన్మానిస్తున్న కలెక్టర్ పట్వారి (ఇన్‌సెట్లో) కార్యక్రమాలను వీక్షిస్తున్న ప్రముఖులు

రాయగడ: భిన్న సంస్కృతులు ఉన్న రాష్ట్రంలో ఆదివాసీల భాష, సంస్కృతి వారి కళలను పరిరక్షించడం మనందరి కర్తవ్యమని రాయగడ జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి అన్నారు జిల్లాలోని గుణుపూర్‌లో ఇడితాల్ పేరిన శనివారం సాయంత్రం జరిగిన చైతీ సాంస్కృతిక ఉత్సవాల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. జిల్లాలోని లంజియా, డొంగిరియా వంటి ఆదిమ తెగకు చెందిన ప్రజలు నివసిస్తున్నారన్నారు. వారిలో భాషాభివృద్ధి, వారు అన్ని రంగాల్లో ముందకెళ్లేలా జిల్లా యంత్రాంగం ప్రోత్సాహిస్తుందని అన్నారు. లంజియా సవర తెగకు చెందిన పెయింటింగ్‌ను ఇడితాల్‌గా పిలుస్తుంటారని చెప్పారు. వారి కళలను గౌరవించే విధంగా చైతీ ఉత్సవాలు ఇడితాల్ పేరిట ఏటా నిర్వహిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారి ఆర్థిక పురోభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసిందని వివరించారు. వారిలో సమైఖ్యత భావంతో పాటు వారి ఆర్థిక, సంక్షేమాభివృద్ధిని జిల్లా యంత్రాంగం చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన స్టాళ్లను ఉత్సవంలో ఏర్పాటు చేశామని అన్నారు. ఉత్సవ కమటీ కన్వీనర్ డాక్టర్ చంద్ర ధ్వజ పండ మాట్లాడుతూ.. ఈ ఇడితాల్ సాంస్కృతిక ఉత్సవాలు ఈ నెల 20 తేదీ నుంచే ప్రారంభం కావల్సి ఉన్నప్పటికీ వర్షం కారణంగా ఆ రోజు రద్దు చేయడం జరిగిందని అన్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమాలను వీక్షించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ గిరిధర్ గొమాంగ్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

చైతీ సాంస్కృతిక ఉత్సవాలు అందరిని ఆలరించాయి. స్థానిక కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వడంతో చాలామంది కళాకారులు తమ ప్రతిభకు అద్దం పట్టే విధంగా ప్రదర్శనలు ఇచ్చారు. దేశీ, ఆదివాసీ, సంబల్‌పూరి, కూచిపూడి, ఒడిస్సీ వంటి నృత్య ప్రదర్శనలు ప్రత్యేకతను చాటుకున్నాయి. కళాకారులకు జిల్లా కలెక్టర్ పట్వారి సన్మానించి అభినందించారు.

రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులకు హామీ ఇస్తున్న బీడీఓ కపిలేశ్వర తండి

జయపురం:

ఖరీఫ్ ధాన్యం ఖరీదు చేసేందుకు మండీలు ఏర్పడుతున్నాయి. ముఖ్యమంత్రి మోహన్ చరణ మఝి, సివిల్ సప్లై మంత్రి కష్ణ చంద్ర పాత్రోలు రైతుల నుంచి మండీలలో ధాన్యం కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆవిభక్త కొరాపుట్ జిల్లాలో ధాన్యాగారంగా పేరుగాంచిన జయపురం సబ్‌డివిజన్‌లో ఏర్పాటు చేసిన మండీలలో ధాన్యం అమ్ముడు పోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితికి కారణం అధికారుల ద్వంద వైఖరేనని ఆరోపిస్తూ కుంద్ర సమితి రైతులు ఆందోళనకు దిగారు. రైతులు, డీఎల్‌పీసీ సమావేశంలో నిర్ణయం మేరకు డిసంబర్ 11వ తేదీన కుంద్ర సమితిలో మండీలు ప్రారంభించారు. అధికారులు, మిల్లర్ల తీరుతో మండీలు తెరచి పది రోజులైనా ధాన్యం కొనుగోలు చేయటంలేదని వందలాదిమంది రైతులు ఆదివారం కుంద్ర సమితి కార్యాలయం వద్ద ధార్నా చేపట్టారు. వెంటనే మండీలకు రైతులు తెచ్చిన ధాన్యం కొనాలని నినదించారు. జిల్లా కషక కళ్యాణ మంచ్ నేతృత్వంలో నిర్వహించిన ధార్నాలో కుంద్రా సమితిలోని అన్ని గ్రామాల నుంచి రైతులు పాల్గొన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న కుంద్ర బీడీఓ కపిలేశ్వర తండి ఆందోళన కారులవద్దకు వచ్చి చర్చలు జరిపారు. రైతుల నుంచి మండీలలో ధాన్యం కొనటం జరుగుతుందని హామీ ఇచ్చి ఆందోళన విరమించాలని విజ్ఞప్తి చేశారు. తాము జిల్లా సివిల్ సప్లై అధికారితో చర్చించి మండీలలో ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడతామని రైతులకు హామీ ఇచ్చారు.



జాతీయ రహదారి ఆందోళన చేస్తున్న రైతులు

జాతీయ రహదారిపై..

జయపురం: ధాన్యం కొనుగోలు చేసేందుకు మండీలు ప్రారంభించి 10 రోజులైనా బొరిగుమ్మ సమితి కమరలో ధాన్యం కొనుగోలు చేయలేదని ఆదివారం వందలాది మంది రైతులు 26వ జాతీయ రహదారిపై బైఠాయించారు. సివిల్ సప్లై మంత్రి ఇటీవల బొరిగుమ్మ వచ్చి మండీ ప్రారంభించి, ధాన్యం కొనుగోలులో ఎటువంటి సమస్యలు ఉండవని హామీ ఇచ్చారన్నారు. అధికారులు ఇచ్చిన టోకెన్లతో ధాన్యం తీసుకువచ్చిన రైతల నుంచి క్వింటాకు 3 కేజీల ధాన్యం అదనంగా తీసుకుంటున్నారని రైతులు తీవ్ర అసంతృప్తి వెల్లడించారు. ఇటువంటి పరిస్థితి నెలకొన్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు తగిన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రహదారిలో ఇరువైలా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సమాచారం తెలుసుకున్న జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరం శొశ్యా రెడ్డి, బొరిగుమ్మ తహసీల్దార్ అమృత లాల్ బెహర, బొరిగుమ్మ ఎస్‌డీపీఓ తపశ్విణీ కువార్, బొరిగుమ్మ పోలీసు అధికారి జుగళ కిశోర్ షా, లేంప్ డైరెక్టర్ ప్రసన్న కుమార్ మిశ్ర వచ్చి రైతులతో చర్చించారు. రెండు రోజుల్లో మండీల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



యువ క్రికెట్ బృందానికి ప్రశంసాపత్రాలు అందజేత

వేడుకగా గజపతి ఉత్సవాలు

పర్లాకిమిడి:

వర్షాల వల్ల గజపతి ఉత్సవాలను పొడిగించామని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ వేదిక మీద ప్రకటించారు. స్థానిక గజపతి స్టేడియంలో జరుగుతున్న గజపతి ఉత్సవాలు ఆదివారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం కార్యక్రమంలో ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, ఏడీఎం రాజేంద్ర మింజ్, డీఆర్‌డీఏ సీడీఎం గుణనిధినాయక్, జిల్లా సమగ్రగిరిజనాభివృద్ధి శాఖ పీఓ అశ్వినీ కుమార్ మహాపాత్రో, సబ్ కలెక్టర్ అనుప్ పండా, డీఆర్‌డీఏ ఆదనపు పీడీ పృథ్వీరాజ్ మండళ్ తదతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఒడిశా సివిల్ సర్వీసులో పోస్టింగ్ పొందిన పదకొండు మందిని సత్కరించారు. అలాగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో బహుమతి పొందిన జి.అఖిల్, రాష్ట్రస్థాయికి వెళ్లిన క్రికెట్ బృందానికి కలెక్టర్ కండువాలు కప్పి సత్కరించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.



మొ గజపతి డాక్యుమెంటరీ వీడియో సి.డి. ఆవిష్కరణ



నూతన ఓ.ఎ.ఎస్.లకు గౌరవ సత్కారం



గజపతి ఉత్సవాల ఆఖరిరోజు ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇతర అధికారులు

అమర సైనికుడికి కన్నీటి వీడ్కోలు



ఈశ్వర్‌కు అంతిమ వీడ్కోలులో పోటెత్తిన ప్రజలు



భర్త శవ పేటిక వద్ద విలపిస్తున్న ఈశ్వర్ భార్య



శ్మశానం వద్ద ఏర్పాటు చేసిన ఈశ్వర్ పోస్టర్

జయపురం: రాజస్థాన్ పోఖ్రాన్ రేంజ్‌లో ఫైరింగ్ అభ్యసిస్తున్న సమయంలో చనిపోయిన ఈశ్వర్ తొలియ పార్థివ దేహానికి శనివారం సాయంత్రం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. అతడి స్వగ్రామంలో దహన సంస్కారాలు జరిగాయి. మృతదేహానికి కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్, కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాత్ మచ్చ, కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర, ఎస్పీ రోహిత్ వర్మ, బొయిపరిగుడ బీడీఓ అభిమన్యు కవి శతపతి, తహసీల్దార్ స్నిగ్ధ రాణి చౌదురి, కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సశ్మిత మెలక, మాజీ ఎమ్మెల్యే రఘునాథ్ పడాల్, బొయిపరిగుడ సమితి అధ్యక్షులు ప్రశాంత కుమార్ గుప్త, ఉపాధ్యక్షురాలు పూర్ణిమ బారిక్, జిల్లా పరిషత్ సభ్యులు రాజేశ్వర మహురియ, కృష్ణ చంద్ర సాగరియ, కెందుగుడ సర్పంచ్ అభిమన్యు నాయిక్ లతో పాటు వందలాదిమంది యువకులు శ్రద్ధాంజలి ఘటించారు.

రైతులను ఆదుకుంటాం: మంత్రి

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వానలతో పలు ప్రాంతాల్లో పంటలు ప్రభావితం అయ్యాయి. ప్రధానంగా గంజాం జిల్లా అకాల వర్షాల బారిన పడింది. జిల్లా వ్యాప్తంగా పొలాల్లో పంట నీట మునిగింది. రాష్ట్ర వాణిజ్య - రవాణా మరియు గనులు - ఉక్కు శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా ఆదివారం గంజాం జిల్లా గోపాలపూర్ నియోజక వర్గంలో పలు ప్రాంతాల్లో ప్రభావిత పంట పొలాలు ప్రత్యక్షంగా సందర్శించారు. పొలాల్లో పంటలు నీట మునిగాయి. చేతికి అందాల్సిన పంట నీట మునగడం పట్ల రైతాంగం ఆందోళన చెందుతోంది. ప్రస్తుత ప్రకృతి వైపరీత్య పరిస్థితుల్లో ప్రభుత్వం పంట నష్టం పరిహారం దిశలో రైతాంగం సంక్షేమానికి చర్యలు చేపట్టాలని బాధిత రైతులు మంత్రికి అభ్యర్థించారు. పొలాల్లో నిండిన నీరు తొలిగే సరికి మరో 10 రోజులు పడుతుందని భావిస్తున్నారు. మరో 2, 3 రోజులు వరకు నీరు నిల్వ ఇదే పరిస్థితి కొనసాగితే వరి మొలకలు ఎత్తే ప్రమాదం పొంచి ఉందని మంత్రికి వివరించారు. మొత్తం మీద పండిన పంటలో అత్యధిక భాగం నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. నష్ట పరిహారం ప్రకటించకుంటే రైతాంగం నిండా మునుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట మునగడంతో పంట నాణ్యత (ఎఫ్ఏక్యూ) గణనీయంగా దిగజారుతుంది. దీనితో వరి కొనుగోలు అసాధ్యం. ఈ నేపథ్యంలో గిట్టుబాటు ధర చేతికి చిక్కే అవకాశం లేదని వివరించారు. వరి నాణ్యత పరిరక్షణకు రైతాంగానికి సహాయ సహకారాలు అందజేయాలని జిల్లా అధికార యంత్రాంగానికి మంత్రి ఆదేశించారు. వరి నాణ్యత నిర్ధారణలో రైతాంగానికి మేలు చేకూరే రీతిలో చేయూతనిచ్చి ఆర్థిక నష్టం లేకుండా శ్రద్ధ వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. గోపాలపూర్ నియోజక వర్గంలో పలు పంచాయతీలు సందర్శించి పంట నష్టం తీవ్రతని ప్రత్యక్షంగా సమీక్షించిన మంత్రి రైతాంగం సంక్షేమానికి భరోసా ఇచ్చారు.



నీట మునిగిన పంట పరిస్థితిని పరిశీలిస్తున్న మంత్రి బిభూతి భూషణ్ జెనా



బాధిత రైతులతో మంత్రి



పంట పొలాల్లో మంత్రి పరిశీలన



నష్టపోయిన పంటని మంత్రికి ప్రదర్శిస్తున్న రైతులు

న్యూస్‌రీల్

30న ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఈ నెల 30న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ ఎం.రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. పురుషులకు కంప్యూటర్ డీటీపీ (45 రోజులు), ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ (30 రోజులు), ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ (30 రోజులు), కారు డ్రైవింగ్ (ఎల్‌ఎల్‌ఆర్ కలిగి ఉండాలి, 30 రోజులు), అలాగే స్త్రీలకు బ్యూటీ పార్లర్ మేనేజిమెంట్ (30 రోజులు), హోమ్ నర్సింగ్ (30 రోజుల పాటు)లలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్ కార్డులతో పాల్గొనాలని సూచించారు. శిక్షణా కాలంలో భోజన, వసతి సదుపాయం కల్పించనున్నామని తెలిపారు. వివరాలకు 90147 16255, 9491741129 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

నేడు జిల్లాకు రానున్న ఓటర్ల జాబితా పరిశీలకులు

విజయనగరం అర్బన్: ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంపై పరిశీలించే నిమిత్తం ఎలక్టోరల్ రోల్ జిల్లా పరిశీలకులు, రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ ఎంవీ శేషగిరి బాబు సోమవారం జిల్లాకు వస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో మధ్యాహ్నం 3గంటలకు జిల్లాలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, సహాయ అధికారులు, జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షిస్తారని పేర్కొన్నారు.

తిప్పలవలస మత్స్యకారుల విడుదల

పూసపాటిరేగ : మండలంలోని తిప్పలవలస గ్రామానికి చెందిన 9 మంది మత్స్యకారులను వారం రోజుల కిందట ఒడిశా తీరంలో ఇండియన్ కోస్ట్‌గార్డులు అదుపులోకి తీసుకున్న విషయం పాఠకులకు విదితమే. వారం రోజుల నుంచి కోస్ట్‌గార్డుల అదుపులో వున్న తిప్పలవలస మత్స్యకారులు విడుదల కోసం బాధిత మత్స్యకారుల బంధువులు ఎమ్మెల్యే లోకం నాగమాధవితో పాటు అధికారులను ఆశ్రయించారు. ఎమ్మెల్యేతో పాటు అధికారులు ఇండియన్ కోస్ట్‌గార్డు అధికారులతో చర్చించారు. దీంతో అదుపులోకి తీసుకున్న మత్స్యకారులను కోస్ట్‌గార్డు అధికారులు ఆదివారం విడుదల చేసారు.

పైడితల్లిని దర్శించుకున్న ప్రభుత్వ కార్యదర్శి నాయక్



పైడితల్లి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న నాయక్ దంపతులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం వేదపండితులు నాయక్ దంపతులకు వేదాశీస్సులు, అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈఓ కెన్‌వీడి.ప్రసాద్ పాల్గొన్నారు.

నగల దుకాణంలో అగ్ని ప్రమాదం



దగ్ధమవుతున్న జ్యూయలరీ షాపు

పాలకొండ రూరల్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల కార్తికేయ నగల దుకాణంలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. సెలవు రోజు కావడంతో షాపు మూసి ఉండగా ఒక్కసారిగా పొగలు రావడాన్ని గుర్తించిన స్థానికులు యజమాని శేఖర్‌కు సమాచారం అందించారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. అప్పటికే దుకాణం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. షాపులో పదికిలోల వెండి ఆభరణాలు, కిలో బంగారు వస్తువులు ఉన్నాయని, వాటితో పాటు విద్యుత్ పరికరాలు, ఏసీలు, ఫర్నిచర్ పూర్తిగా దగ్ధం కావడం, పండగల సీజన్‌లో జీవనోపాధి అయిన దుకాణం కాలి బూడిదవదంతో యజమానితో పాటు పనివారు కన్నీరు పెట్టుకున్నారు. సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న సీఐ మీసాల చంద్రమౌళితోపాటు, అగ్నిమాపక ఎస్సై జామి సర్వేశ్వరరావు, విద్యుత్ శాఖ సిబ్బంది ఘటనపై ఆరా తీశారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.





విజయనగరం మండలం పినవేమలిలో సాగులో ఉన్న పెసర పంట

వ్యవసాయ సిబ్బందికి
బీమా కష్టాలు..!

- పంటల బీమా ప్రీమియం కోసం వేడుకోలు
- చెల్లింపునకు ఆసక్తి చూపని రైతులు
- 49,317 ఎకరాల్లో వరి, మొక్కజొన్న తదితర పంటల సాగు
- బీమా కట్టింది 1722.5 ఎకరాలకే..
- వరికి ఎకరాకు రూ.630, మొక్కజొన్నకు రూ.540 ప్రీమియం
- అపరాలకు రూ.300 చొప్పన ప్రీమియం చెల్లించాలి


అన్నదాతకు కూటమి సర్కార్ పాలనలో అన్నీ అష్టకష్టాలే..గత వైఎస్సార్‌సీపీ పాలనలో సాగు పెట్టుబడి రైతు భరోసా నుంచి పంటల బీమా ప్రీమియం చెల్లింపు వరకు అన్నీ తానై ప్రభుత్వమే చూసుకునేది. కూటమి సర్కార్ వచ్చాక ఇవేమీ రైతులకు లేకుండా పోయాయి. ఎన్నికల సమయంలో రైతు భరోసా బదులు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఇస్తామన్నది లేకుండా పోయింది. అలాగే పంటల బీమా ప్రీమియం గతంలో జగనన్న ప్రభుత్వమే చెల్లించేది. ఇప్పుడు రైతులే చెల్లించాలని ఖరాకండిగా చెప్పేసింది. ఈ పరిణామాలతో రైతులు అవస్థలు పడుతున్నారు.

విజయనగరం ఫోర్ట్:

వెంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిన సామెత చందాన తయారైంది జిల్లాలో వ్యవసాయ సిబ్బంది పరిస్థితి. రబీలో సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం రైతులు చెల్లించేలా చూడాలని వ్యవసాయ సిబ్బందికి కూటమి సర్కార్ ఆదేశాలు ఇవ్వడంతో ఏం చేయాలో తెలియని అయోమయ స్థితిలో వ్యవసాయ సిబ్బంది కొట్టుమిట్టాడుతున్నారు. ప్రతీ పంటకు పంటల బీమా పొందాలంటే ప్రీమియం చెల్లించాల్సిన పరిస్థితి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు పంటల బీమా ప్రీమియంను ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో ప్రభుత్వమే చెల్లించింది. రైతులపై ఒక్క పైసా కూడా భారం పడనీయలేదు. ప్రస్తుత కూటమి సర్కార్ ఉచిత పంటల బీమా ప్రీమియంకు మంగళం పాడింది. దీంతో పంటల బీమా ప్రీమియంను రైతులే చెల్లించుకోవాల్సిన పరిస్థితి. దీంతో రైతులు బీమా ప్రీమియం చెల్లించడానికి ఆసక్తి చూపడం లేదు. అయితే పంటల బీమా ప్రీమియం రైతులతో ఎలాగైనా కట్టించాలని ప్రభుత్వం నుంచి ఒత్తిడి రావడంతో వ్యవసాయ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. పంటల బీమా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయ సిబ్బంది రైతులను బ్రతిమాలిడుతున్నారు. అయినప్పటికీ రైతుల నుంచి పెద్దగా స్పందన రావడం లేదు.

49,317 ఎకరాల్లో పంటల సాగు

రబీలో పంటల బీమా పరిధిలో వరి, మొక్కజొన్న, పెసర, మినుము పంటలు ఉన్నాయి. ఇప్పటి వరకు ఈ పంటలు 49,317 ఎకరాల్లో సాగయ్యా యి. పెసర పంట 10,084 ఎకరాలు, మినుము 24,876 ఎకరాలు, మొక్కజొన్న 14,335 ఎకరాలు, వరి 22 ఎకరాల్లో సాగయ్యాయి. పంటబీమా ప్రీమియం పెసర పంటకు సంబంధించి 26.3 ఎకరాలు, మినుము 83.1 ఎకరాలు, మొక్కజొన్న 75.1 ఎకరాలు, వరి పంట రబీలో సాగైన 22 ఎకరాలతో పాటు 1516 ఎకరాలకు ఖరీఫ్, రబీ సీజన్‌కులకు బ్యాంకు రుణం తీసుకునే సమయంలో బ్యాంకు అధికారులు ప్రీమియం కట్టించుకున్నారు.



డెంకాడ మండలంలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట

47,594.5 ఎకరాలకు ప్రీమియం కట్టాల్సి ఉంది

రబీ సీజన్‌కు సంబంధించి పెసర పంటకు 10,057.7 ఎకరాలకు, మినుము 24,792.9 ఎకరాలకు, మొక్కజొన్న పంటకు 14,259.9 ఎకరాలకు బీమా ప్రీమియం మొత్తంగా 47,594.5 ఎకరాలకు చెల్లించాల్సి ఉంది. వరి పంటకు బీమా ప్రీమియం ఎకరాకు రూ.630 చెల్లించాలి. మొక్కజొన్నకు రూ. 540, పెసర, మినుము పంటకు రూ.300 చొప్పన ప్రీమియం చెల్లించాల్సి ఉంది.

ఐదేళ్లు ప్రీమియం చెల్లించిన జగనన్న ప్రభుత్వం

ఐదేళ్ల పాటు పంటల బీమా ప్రీమియం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే చెల్లించింది. ఏటా రూ.13 కోట్లు వరకు ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించింది. 2019 నుంచి 2023 వరకు చెల్లించింది. పంట సాగు చేసిన రైతులు ఈ-క్రాప్, ఈకేవైసీ చేయించుకుంటే చాలు. ఈకేవైసీ అయిన పంటకు ప్రభుత్వం పంటల బీమా క్రింద ప్రీమియం చెల్లించింది. జిల్లాలో 2019 నుంచి 2023 వరకు జరిగిన పంట నష్టంకు పంటల బీమా క్రింద 37,497 మంది రైతులకు రూ.33.08 కోట్లు పంట బీమా కింద ప్రభుత్వం చెల్లించింది.

గత ప్రభుత్వమే చెల్లించేది..

నాకు రెండు ఎకరాల పొలం ఉంది. అందులో ఖరీఫ్ సీజన్‌లో వరి, రబీలో పెసర పంట వేసేవాడిని. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ- క్రాప్ చేసుకుంటే చాలు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించేది. రబీలో ప్రస్తుతం పెసర పంట వేసాను. ఇప్పుడు ఎకరాకు రూ.300 చొప్పన ప్రీమియం చెల్లించమంటున్నారు.

– సిరపురపు రామునాయుడు, రైతు

రైతులే చెల్లించాలి..

రబీ నుంచి పంటల బీమా ప్రీమియంను రైతులే చెల్లించుకోవాలి. వరి, మొక్కజొన్న, పెసర, మినుము పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలని రైతులకు చెబుతున్నాం. విపత్తుల వల్ల పంట నష్టం జరిగితే రైతులకు బీమా వస్తుందనే విషయాన్ని గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

నేడు శంబర పెదపోలమాంబ అమ్మవారి చాటింపు

- 30న గ్రామానికి చేరుకోనున్న పెదపోలమాంబ
- వచ్చే ఏడాది జనవరి 27, 28, 29 తేదీలలో అమ్మవారి జాతర



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ మేనత్త పెదపోలమాంబ అమ్మవారు సనప చాటింపు సోమవారం జరగనుంది. సోమవారం నుంచి శంబర గ్రామంలో పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ప్రారంభం కానుంది. ఆనవాయితీ ప్రకారం సోమవారం గ్రామస్తులంతా సమావేశమై, పెద్ద అమ్మవారిని గ్రామంలోకి తీసుకువచ్చేందుకు సనప చాటింపు వేస్తారు.

30న పెద్ద అమ్మవారిని కొనితెచ్చుట

శంబర గ్రామం నుంచి ఎస్.పెద్దవలస గ్రామానికి వెళ్లే రహదారి వద్ద పూజలు నిర్వహించి, పోలమాంబ మేనత్త పెద పోలమాంబ అమ్మవారిని ఈ నెల 30వ తేదీన గ్రామంలోని పెద్ద అమ్మవారి ఆలయంలోకి భాజాభజింత్రుల నడుమ అమ్మవారిని తీసుకువస్తారు. అమ్మవారు గ్రామంలో కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. జనవరి 6న తొలేళ్ల ఉత్సవం, 7న పెద్ద పండగ, 8న అనుపోత్సవం నిర్వహిస్తారు.

జనవరి 8న పోలమాంబ అమ్మవారిని కొనితెచ్చేందుకు చాటింపు

వచ్చే ఏడాది జనవరి 8వ తేదీన పెదపోలమాంబ అమ్మవారిని అనుపోత్సవం నిర్వహించిన అనంతరం శంబర పోలమాంబ అమ్మవారిని కొని తెచ్చేందుకు గ్రామంలో చాటింపు వేస్తారు. జనవరి 13వ తేదీన గోముఖీ నది ఒడ్డున పూజలు నిర్వహించి, పోలమాంబ అమ్మవారిని గ్రామంలోకి తీసుకువస్తారు. 14వ తేదీన అమ్మవారు చదురుగుడిలో విశాంత్రి తీసుకొని, 13 రోజుల పాటు గ్రామంలోని చదురుగుడిలో భక్తులకు దర్శనమిస్తూ, సాయంత్రం వేళల్లో గ్రామంలో తిరువీధి నిర్వహిస్తారు. జనవరి 27వ తేదీన తొలేళ్ల ఉత్సవం, 28న సిరిమానోత్సవం, 29న అనుపోత్సవం నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించారు.

సినీ గేయ రచయితగా
రామారాయపురం యువకుడు

- గ్రామీణ ప్రాంతం నుంచి సినీ పరిశ్రమ వైపు అడుగులు
- ఇప్పటి వరకూ 21కి పైగా పాటలు రచించిన చిరంజీవి

రాజాం/సంతకవిటి :



యెన్ని చిరంజీవి

అతనొక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన యువకుడు. అంతంత మాత్రంగానే ఆర్థిక స్తోమత ఉండడంతో డిగ్రీ పూర్తి చేసి ఉపాధి వైపు దృష్టి సారించాడు. ఒక వైపు ప్రైవేట్ కంపెనీల్లో పని చేస్తూ మరో వైపు మ్యూజిక్ డైరెక్టర్లకు పాటలు రచించి అందజేస్తున్నాడు. గత మూడేళ్ల కాలంలో 21కి పైగా సినీ పాటలు రచించి ఔరా అనిపించుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే..

సంతకవిటి మండలం రామారాయపురం గ్రామానికి చెందిన యెన్ని చిరంజీవి ఇటీవల హాట్ టాపిక్‌గా మారాడు. అయోధ్య శ్రీరామ మందిర ఆల్బమ్‌కు సంబంధించిన సన్నివేశాలు, పాటలు ఎస్పీ ప్రొడక్షన్‌లో సమీర్ పిలకలపాటి నిర్మిస్తుండగా ఇందులో 'అయోధ్య శ్రీరామ రూపం...ధరణీ దర్శన పుణ్యతీర్థం' పాటను చిరంజీవి రచించారు. ఈ పాటను సత్యకశ్యప్, స్నికిత, శ్రాఫ్వీలు ఆలపించారు. ప్రస్తుతం ఈ పాట సామాజిక మాధ్యమాల్లో కోట్లాది మందిని సొంతం చేసుకోంది. ఈ పాటను హిందీలో తన్వీర్‌గజ్వీ రచిస్తున్నారు. దీంతో చిరంజీవి పేరు తెరపైకి వచ్చింది.

చిరంజీవి విశేషాలు

చిరంజీవి 1నుంచి 5వ తరగతి వరకూ రామారాయపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, 6 నుంచి పది వరకూ మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ సంతకవిటి జూనియర్ కళాశాలలో, డిగ్రీ(బీఏ) శ్రీకాకుళంలో హెచ్‌పీఎల్ కళాశాలలో పూర్తి చేసారు. డిగ్రీ అనంతరం కంప్యూటర్ వర్క్స్ పూర్తి చేసారు. సినీ పాటలపై మక్కువతో హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ కొన్నాళ్లు ఉండి అవకాశాలు లేక తిరిగి ఇంటిముఖం పట్టాడు. పొందూరు సమీపంలో ఓ ప్రైవేట్ కంపెనీలో చేరిన చిరంజీవి తన పట్టుదల వదలలేదు. ఖాళీ సమయాల్లో పాటలు రాయడం, మ్యూజిక్ డైరెక్టర్లకు పంపించడం చేస్తున్నాడు. ఇందులో భాగంగా ఇటీవల ఈయన రచించిన పాటలు సినిమాలకు, వెబ్ సిరిస్‌లకు వినియోగించి, చిరంజీవికి పారితోషి కం అందించారు. చిరంజీవి తల్లిదండ్రులు కళావతి, కృష్ణమూర్తిలు రోజువారీ కూలీలు.

ఇప్పుడిప్పుడే..

చిరంజీవి రచించిన పాటలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ సత్యకశ్యప్, సినీ డైరెక్టర్ సీపాన శ్రీధర్‌లు చిరంజీవికి అవకాశాలు కల్పించారు. సత్యకశ్యప్ వైకల్యం సినిమాకు సంబంధించి 'వనవాసమేలే సీతమ్మలా' అనే లిరిక్‌తో కూడిన చిరంజీవి రచించిన పాట హిట్ అయ్యింది. ఈ పాటను దివ్య మాలిక్ గానం ఆలపించారు. ఈ సినిమాలో ఇంకో పాట సుద్దాల అశోక్‌తేజ రాయడం జరిగిందని చిరంజీవి వెల్లడించారు. ఇటీవల హ్యాపీ ఎండింగ్ వెబ్ సిరీస్‌కు ఒక పాటను అందించిన చిరంజీవి అంతకు ముందు పది సినిమాలకు, వెబ్ సిరీస్‌లకు పాటలు అందించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో పలువురు ఎమ్మెల్యే అభ్యర్థులకు పాటలు రచించి ఔరా అనిపించుకున్నాడు. రేలారే రేలా రఘు అనే కళాకారునికి సైతం పాటను రచించి అందించినట్లు చిరంజీవి తెలిపాడు. గత మూడేళ్లలో తాను రాసిన 21 పాటలు హిట్ అవ్వడమే కాకుండా మంచి పేరు తీసుకొచ్చాయని, జనవరిలో కొత్త సినిమా ఆఫర్ ఉందని.. అందులో రెండు పాటలకు అవకాశం ఇస్తున్నట్లు నిర్మాతలు తెలిపారని చెప్పాడు.

చిన్న పరిశ్రమలకు బ్యాంకర్ల సహకారం లేదు

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేద్దామనుకునే ఉత్సాహవంతులకు కొంతమంది బ్యాంకర్లు సంబంధంలేని ప్రశ్నలు వేసి ఇబ్బంది పెడుతున్నారని లోక్‌సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఈ మేరకు రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలనా మంత్రి కొండపల్లి శ్రీనివాస్కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారుచేస్తానని ప్రకటనలు ఇస్తున్నా.. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. ఉన్నత చదువులు చదువుకున్న ఇద్దరు వ్యక్తులు బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో తమకున్న చిన్న పరిశ్రమను ఆధునీకరణ చెయ్యడానికి బొబ్బిలి యూనియన్ బ్యాంక్‌ను సంప్రదిస్తే గడచిన మూడు నెలలుగా తిప్పుతున్నారని ఆరోపించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం లేదన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు

గజపతినగరం: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీకే ఈశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ 32వ జిల్లా మహాసభల ముగింపు కార్యక్రమంలో ఆయన ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు కేటాయించి నిర్మాణం వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, సంక్షేమ వసతిగృహాల్లో మెస్ చార్జీలు పెంచి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సభల్లో పలు తీర్మానాలు ఆమోదించారు. సభలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.మోహనరావు, శ్రీనివాస్, రాములు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర హైకోర్టులో పెండింగ్ కేసుల్లేవు..

- కోర్టుకు తాళం వేసి వచ్చా..
- ఈ పరిస్థితి దేశం అంతా రావాలి
- త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అమర్‌నాథ్‌గౌడ్



మాట్లాడుతున్న త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టి.అమర్‌నాథ్‌గౌడ్

కొత్తవలస : త్రిపుర హైకోర్టులో ఎటువంటి కేసులు పెండింగ్‌లో లేవని, కోర్టుకు తాళం వేసి వచ్చానని ఆ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టి.అమర్‌నాథ్‌గౌడ్ అన్నారు. మండలంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ ఆస్పత్రి ప్రారంభానికి ఆయన ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఆ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత అక్కడ పెండింగ్‌లో ఉన్న 65 శాతం కేసులను పరిష్కరించానని తెలిపారు. వరుసగా నాలుగైదు రోజులు కేసులు లేకపోవడంతో కోర్టుకు తాళం వేసి ఉంటుందన్నారు. ఇలాంటి పరిస్థితి దేశం అంతా రావాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. తాను గతంలో ప్రపంచ రికార్డులో భాగంగా భారతదేశం నుంచి 92 వేల కేసులకు తీర్పులు చెప్పానని, రోజుకు సరాసరి 109 కేసులకు సంబంధించి జడ్జిమెంట్లు ఇచ్చానని తెలిపారు. ఇందులో కేవలం 19 కేసులు మాత్రమే సుప్రీం కోర్టుకు అప్పీల్‌కు వెళ్లాయని చెప్పారు. దీన్ని బట్టి కక్షిదారులు, న్యాయవాదులు ఎంత సంతోషకరంగా ఉన్నారో అర్థం చేసుకోవాలన్నారు. ఇది తనకు ఎంతో ఆత్మ సంతృప్తి ఇచ్చిందన్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో 2 లక్షల 30 వేల కేసులు పెండింగ్‌లో ఉంటే 88 వేల కేసులను పరిష్కరించినట్టు తెలిపారు. లిటిగేషన్ లేని కోర్టు, పేషంట్ లేని ఆస్పత్రులు, వృద్ధుల్లేని వృద్ధాశ్రమాలు ఉండాలని కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు.


రామతీర్థంలో వైభవంగా పూజలు



స్వామి సన్నిధిలో పూజలు జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో పవి త్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవనం, ఆదిత్య హృదయం తదితర హోమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం వెండి మండపం వద్ద సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ స్థానాచార్యులు నరసింహాచార్యులు ఆధ్వర్యంలో తిరుప్పావై ఉపన్యాసాలు చదివి వినిపించారు. అర్చకులు సాయి రామాచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు, పవన్, రామగోపాల్ పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..



తుఫాన్ ప్రభావం తగ్గింది. మంచు ప్రభావం పెరిగింది. ఆదివారం ఉదయం వేపాడ మండలంలో పలుచోట్ల మంచు పొలాలను కప్పేసేలా... రోడ్లను మూసేలా కురిసింది. ఉదయం 9 గంటల వరకు మంచు విపరీతంగా కురియడంతో ప్రజల సాధారణ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. పొలాలకు వెళ్లే రైతులు, వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు.

– వేపాడ